నేడు బక్రీద్

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 16: బక్రీద్‌ను పురస్కరించుకుని మసీదులు ముస్తాబయ్యాయి. జిల్లాలో సోమవారం బక్రీద్ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని జామియా మసీదుతోపాటు జిల్లావ్యాప్తంగా మసీదులను సుందరంగా అలంకరించారు. ఆదివారం జామియా మసీదు కమిటీ నిర్వాహకులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు జామియా మసీదు వద్దకు చేరుకుని నమాజ్‌లో పాల్గొనాలని కోరారు.

నేడు జిల్లాకు కేంద్ర, రాష్ట్ర మంత్రుల రాక

- రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు



మంత్రి అచ్చెన్నాయుడు



కేంద్రమంత్రి రామ్మోహన్

అరసవల్లి, జూన్ 16: కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా సోమవారం జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా వారికి ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. 'విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ఎన్ఏడీ వయా మద్దిలపాలెం మీదుగా ర్యాలీగా జిల్లాకు రానున్నారు. భోగాపురం వద్ద భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరుతారు. శ్రీకాకుళం సింహద్వారం, డే అండ్ నైట్ కూడలి, ఏడురోడ్ల జంక్షన్, జీటీ రోడ్డు, సూర్యమహల్ జంక్షన్, అరసవల్లి జంక్షన్ మీదుగా ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఇంటి వరకు ర్యాలీ జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు ఎంపీ కార్యాలయం నుంచి బయలుదేరి రామలక్ష్మణ జంక్షన్, పెద్దపాడు, జాతీయ రహదారి మీదుగా నిమ్మాడ చేరుకుంటారు' అని వారు తెలిపారు. కార్లపై వచ్చేవారు సోమవారం ఉదయం 8 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు రావాలని సూచించారు. అలాగే స్వర్గీయ ఎర్రన్నాయుడు విగ్రహం వద్ద స్వాగతం పలికి బైక్‌ర్యాలీతో ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ మైదానంలో ఆత్మీయ అభినందన కార్యక్రమం జరుగుతుందని వివరించారు.



ఇళ్లపై కూలిన చెట్టు

శ్రీకాకుళం అర్బన్, జూన్ 16: శ్రీకాకుళం చౌకబజార్‌లోని మసీదుకు ఆనుకుని ఉన్న పెద్ద రావిచెట్టు ఆదివారం వేకువజామున 3గంటల సమయంలో కూలిపోయింది. చెట్టు కొమ్మలు విరిగిపడి.. మూడు రేకు ఇళ్లు దెబ్బతిన్నాయి. గట్టెం లోకేశ్వరరావు, జయమ్మ దంపతులు, తాతపూడి పైడిరాజు, నాగమణి దంపతులతో పాటు మరొకరి ఇల్లు దెబ్బతినడంతో బాధితులు లబోదిబోమన్నారు. పూలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, ఇళ్లు ధ్వంసం కావడంతో తామెలా బతుకుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం 20వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఇప్పిలి తిరుమలరావు.. నగరపాలక సంస్థ అధికారులకు సమాచారం ఇచ్చారు. కార్పొరేషన్ సిబ్బంది వచ్చి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి నడిచేందుకు అవకాశం కల్పించారు. బాధితులను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పరామర్శించారు. ఘటనపై ఆరా తీసి.. ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కాగా.. మసీదు పక్కన ఓ వ్యక్తి కొత్తగా ఇల్లు నిర్మిస్తున్నాడని, ఈ నేపథ్యంలో మర్రిచెట్టుపై యాసిడ్ పోసి కాల్చేయడంతో ఈ అనర్థం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.



నరసన్నపేట : చిట్టోడు చెరువు గట్టును చదును చేసిన ప్రాంతాన్ని చూపిస్తున్న రైతులు

ఆక్రమణల పర్వం

- అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు

నరసన్నపేట/ టెక్కలి, జూన్ 16: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నరసన్నపేట మండలం కరగాం పంచాయతీ అంపలాం వద్ద ఉన్న చిట్టోడు చెరువును ఆక్రమించి చదును చేస్తుండడంపై ఆయకట్టు రైతులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా దూకలపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి యంత్రాల సాయంతో మట్టిని తరలించి.. ఆక్రమణకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు ఆక్రమణలను అడ్డుకున్నారు.

- నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న మహిళామార్ట్ వద్ద ఆదివారం అక్రమంగా షెడ్ నిర్మాణం చేపట్టారు. షాపింగ్ కాంప్లెక్స్ వద్ద గ్రంథాలయం పక్కనే ఇప్పటికే ఆక్రమణకు గురికాగా తాజాగా ఈ షెడ్ నిర్మాణం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంపీడీవో కార్యాలయం ప్రహరీ చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
- టెక్కలి మేజర్‌పంచాయతీ సంతోషిమాత గుడి ఎదురుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ స్థలంలో ఓ వైసీపీ కార్యకర్త అక్రమంగా కట్టడం చేపడుతున్నారు. దీనిపై స్థానిక నాయకులు ఆదివారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.



కేశఖండన శాల వద్ద భక్తుల రద్దీ

ఆదిత్యుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి, జూన్ 16: అరసవల్లిలో ఆదిత్యుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఒక్కరోజే స్వామికి రూ.7,26,730 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ. 3.96లక్షలు, విరాళాల ద్వారా రూ. 78,890, ప్రసాదాల ద్వారా రూ. 2,51,840 ఆదాయం లభించినట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. అలాగే రెడ్డి కిల్లిపాలెనికి చెందిన సింహాద్రి వెంకటరమణమూర్తి కుటుంబ సభ్యులు.. తన తల్లి అప్పలనర్సమ్మ జ్ఞాపకార్థం అన్నదాన పథకానికి రూ.1,00,116 చెక్కును ఈవోకు అందజేశారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట వేయాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు దిలీప్‌కుమార్

అరసవల్లి, జూన్ 16: 'విద్యాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి. మంత్రి నారా లోకేశ్.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవో 117ను తక్షణమే రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల'ని ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం శ్రీకాకుళం ఎన్జీవో హోంలో నిర్వహించిన ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాలను సమానంగా కొనసాగించాలి. బకాయిలు తక్షణమే చెల్లించాలి. సీపీఎస్ రద్దు చేయాలి. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి.. గుణాత్మక విద్యను అందించాల'ని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వేంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి పి.బాలాజీరావు, ఆర్వీ అనంతాచార్యులు, టి.గిరిరాజు, పి.ఆనందరావు, కె.రవికుమార్, జి.పోలీసు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



చంద్రమౌళీశ్వరరావు (ఫైల్)

అరసవల్లి: శ్రీకాకుళంలోని చిన్న బరాటం వీధిలో నివాసముంటున్న వ్యాపారవేత్త,చంద్రమౌళిడిపార్ట్ మెంట్ స్టోర్స్ యజమాని పట్నాల చంద్రమౌళీశ్వరరావు(72) ఆదివారం మృతిచెందారు.ఆయన నేత్రాలను కుటుంబసభ్యులుజామిరమేష్, పట్నాల నవీన్‌కుమార్ దానం చేయడానికి అంగీకరించారు. దీంతో మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ సుజాత, సహాయకులు ఉమా శంకర్ కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికిఅందజేశారు.తానుచనిపోయినా మరో ఇద్దరికి చూపును ప్రసాదించిన ఆయన నేత్రాలు సజీవమని రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహనరావు తెలిపారు.

ఎన్‌ఈపీ రద్దుచేయాలి

ఆమదాలవలస: నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని(ఎన్‌ఈపీ) ఎస్‌ఎఫ్ఐ మహాసభల్లో తీర్మానించారు. ఆదివారం చింతాడలో ఎస్‌ఎఫ్ఐ ముగింపు సభ నిర్వహించారు.కార్యక్రమంలో పూర్వ ఎస్‌ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రసన్నకుమార్, కార్యదర్శి ఎ.అశోక్, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వినోద్, రామ్మోహన్, వెంకటేష్, ఎల్‌జెనాయుడు పాల్గొన్నారు.

ఎన్‌ఈఆర్ దృష్టికి రజకుల సమస్యలు

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును రజక సంఘం నాయకుడు గురజాపు రాము ఆధ్వర్యంలోనాయకులు సోపేటి రామారావు, జొన్నాడ భాస్కరరావు, లక్ష్మీ, సూరిబాబు, రామారావు ఆదివారం కలిశారు. ఈసందర్భంగా రజకుల సమస్యలను సంఘ నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

కేశుపురం గ్రోయిన్‌కు మరమ్మతులు

ఇచ్ఛాపురం: ఈదుపురం వంతెన వద్ద ఉన్న కేశుపురం గ్రోయిన్ మరమ్మతులను ఆదివారం రైతులు చేపట్టారు. బూర్జుపాడు, డొంకూరు, పెద్దలక్ష్మీపురం, చిన్న లక్ష్మీపురం, శివకృష్ణాపురం గ్రామాలకు చెందిన 600 మంది రైతులు రూ.2.50 లక్షల సొంతంగా నిధులు సేకరించి శ్రమదానం చేసి గ్రోయిన్ పనులు చేపట్టారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

సోంపేట: పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని రోటరీ గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు తెలిపారు.ఆదివారం సోంపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.25 లక్షలతో నిర్మించిన సులబ్ కాంప్లెక్స్‌ను సోంపేట రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పీవీ కృష్ణారావు, కె.రవికుమార్ రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒడియా పోస్టులు భర్తీచేయాలి

సోంపేట: సీబీఎస్సీ పాఠశాలల్లో ఆంధ్రామాధ్యమిక బోర్డును కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షుడు(అపోటా) భాస్కర పాడి కోరారు.ఆదివారం సోంపేట ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆపోటా సమావేశం నిర్వ హించారు.

మోహినీ భద్రాంబిక ఉత్సవాలు

గార: శ్రీకూర్మంలో మోహినీ భద్రాంబిక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఆదివారం యువకులు పులి వేషాలు, డప్పువాయిద్యాలతో సందడి చేశారు. మంగళవారం గ్రామదేవత ఉత్సవంలో భాగంగా అనుపోత్సవం నిర్వహించనున్నారు. బంధువులు, స్నేహితులు రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి

శ్రీకాకుళం క్రైం: ఎన్డీయే ప్రభుత్వం అబ్కారీలో సొండి కులస్థులకు రిజర్వేషన్ కల్పించాలని, ఓబీసీలో చేర్చాలని చంద్రబాబునుసొండి కుల సంక్షేమ సంఘ రాష్ట్రఅధ్యక్షుడు ఆర్.కాశీవిశ్వనాథ్ చౌదరి కోరారు. ఆదివారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్వతీ పురంలో చంద్రబాబు తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా ప్రత్యేక రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

పరిశ్రమ సిబ్బందిపై కార్మికుల దాడి

రణస్థలం: యూబీ పరిశ్రమ జీఎం డి.రామకృష్ణ, మరికొందరి సిబ్బందిపై అదే పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు దాడి చేసినట్లు జేఆర్‌పురం పోలీసులకు జీఎంరామకృష్ణ ఆదివారం ఫిర్యాదుచేశారు. బోటలింగ్ లోడింగ్,అన్‌లోడింగ్ విషయంపై శనివారం పరిశ్రమలో కార్మికులు, ఉద్యోగుల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈనేపథ్యంలో తమపై కార్మికులు ఎస్.గంగులు, కె.మాలచ్చి, వై.చిన్నారావుతోపాటు మరో ఆరుగురు దాడిచేశారని జీఎం రామకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నదులను పరిరక్షించాలి

- నగరపాలక సంస్థ హెల్త్ అధికారి వెంకట్రావు



నదిలో శుభ్రంచేస్తున్న కార్మికులు, వివిధ సంస్థల ప్రతినిధులు

అరసవల్లి: నదులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని శ్రీకాకుళం నగరపాలక సంస్థ హెల్త్ అధికారి వెంకట్రావు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని హయాతినగరం నాగావళి నదిలో పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా నగరపాలకసంస్థ కార్మికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శ్రమదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్,సాసపు జోగినాయుడు,గోలి ఉమామహేశ్వరరావు, జీఎస్ రావు, టీడీపీ నేత తోలేటి వెంకన్నయాదవ్, ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అధికారులు, విష్ణుమూర్తి, బలరాం, పి.ప్రశాంత్, మధు, ప్రణీత్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



వైద్య సేవలందిస్తున్న బొడ్డేపల్లి సురేష్

శ్రీకాకుళం రూరల్: ప్రజలు మానసిక రుగ్మతలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని డాక్టర్ సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చింతాడలో ప్రముఖ వైద్యుడు, సన్‌రైజ్ హాస్పిటల్ అధినేత, లయన్ డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 200మందికి బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్లవాతానికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ పరిసరాల్లో పలుచోట్ల మొక్కలు నాటి గ్లోబల్ వార్మింగ్, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించారు.

మంత్రి అచ్చెన్నకు అభినందన



అచ్చెన్నాయుడిని అభినందిస్తున్న వరప్రసాద్

అరసవల్లి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, వ్యవ సాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో డి.వరప్రసాద్, జీఎం ఎస్‌వీఎస్ జగదీష్ విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు అచ్చెన్నాయు డికి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు.

వృద్ధులపై వేధింపులను నివారించాలి

కలెక్టరేట్: వృద్ధులపై వేధింపులను నివారించాలని, వృద్ధుల పోషణ, సంరక్షణ, వృద్ధుల ఆస్తి,ప్రాణ రక్షణ విషయాలపై ప్రభుత్వంచట్టాలను పటిష్టంగా అమలుచేయాలని వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బలివాడ మల్లేశ్వరరావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు డిమాండ్‌చేశారు.శ్రీకాకుళంలోని శాంతాకళ్యాణ అనురాగనిలయం నుంచి వృద్ధులు కలెక్టర్ కార్యాలయం వరకు ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం జేసీ ఎం.నవీన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, సోమసుందరరావు, ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, పీఎస్ ప్రసాదరావు, జానకిరాం పట్నాయక్, నర సింహపండా, బి.మోహనరావు, అమీనుల్లా బేగ్, కె.రామ్మోహనరావు, గణపతిరావు, పోలయ్య, ఎన్.కోటేశ్వరరావు, ఝాన్సీరాణి, సత్యవతి, అన్నపూర్ణ, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

శ్రీకాకుళం క్రైం: రోడ్డుపై కత్తితో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు యత్నించిన ఘటనలో నిందితుడ్ని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు.పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళంలోని బలగ హాస్పిటల్ రోడ్డులో ఈనెల 13న నల్లపిల్లి గౌరీశంకర్‌ను మందలవీధికి చెందిన బొమ్మాళి గిరి కొడవలి కత్తితో హత్య చేసేందుకు యత్నించాడు. ఈ నేపథ్యంలో గిరి పరారయ్యాడు. దీంతో బాధితుడు దమ్మలరెల్లివీధి గౌరీశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు గిరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గిరి ఆదివారంపేట సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఉన్నట్టు సమాచారం వచ్చింది. సీఐ తన బృందంతో అక్కడకు చేరుకుని గిరిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. గిరి నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాలువల్లో పూడికతీతతో ట్రాఫిక్ అంతరాయం

శ్రీకాకుళంఅర్బన్: శ్రీకాకుళంలోని లోతట్టు, నీటిముంపునకు గురయ్యేప్రాంతాలను కమిషనర్ గుర్తించి కాలువల్లో పూడికతీత పనులు శనివారం రాత్రి నుంచి ప్రారంభించారు. దీంతో పలుప్రాంతాల్లో ఆదివారం ట్రాఫిక్‌కుఅంతరాయం కలిగింది.బలగ, హాస్పటల్ రోడ్డు, ఫారెస్టు కార్యాలయంరోడ్డు, ఇలిసిపురం, రైతుబజార్ ప్రాంతాల్లో ఒన్‌వే ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా కమిషనర్ తమీమ్‌అన్సారియా మాట్లాడుతూ కాలువ పూడికతీత పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్యపై ట్రాఫిక్ సీఐ అవతారంతో చర్చించినట్లు చెప్పారు. ట్రాఫిక్ సీఐ అవతారం తక్షణమే ఒన్‌వే రూట్ ఇచ్చి ఆ మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. పూడికతీతలు తొలగించాక మళ్లీ యథావిధిగా వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని తెలిపారు.

పైపులైన్ల మరమ్మతుల ప్రతిపాదనలకు సిద్ధం

పొందూరు: పొందూరుకు తాగునీరందించే పైపులైన్ల మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, తాగునీటిసరఫరా సమస్యలకు శాశ్వతపరిష్కారం చూపుతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్య, టీడీపీ పొందూరుమండలాధ్యక్షుడు రామ్మోహన్, టీడీపీ పట్టణాధ్యక్షుడు చినరంగ తెలిపారు. లైదాం రెల్లిగెడ్డ నుంచి పైపులైన్ల ద్వారా పొందూరుకు తాగునీరందుతోంది. ఈ పైపులైన్లు లీకేజీ వల్ల తరచు పాడవుతున్నాయి. దీంతో వారు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో పైపులైన్ల మరమ్మతుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించండి

శ్రీకాకుళం రూరల్: అన్ని రంగాల్లో వెనుకబడిన తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఆ సామాజిక వర్గ నాయకులు సురంగిమోహన్‌రావు కోరారు. ఆదివారం శ్రీకాకుళంలో తూర్పుకాపు సంఘ నాయకులు సురంగిమోహన్‌రావు, రాజశేఖర్, బుడితి అప్పలనాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాతపట్నం, చీపురుపల్లి నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన మామిడి గోవిందరావు, కళావెంకట్రావుల్లో ఒకరికి మంత్రి పదవి ఇచ్చి తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సామాజిక వర్గనాయకులు బి.రాజారావు,లంక గాంధీ పాల్గొన్నారు.

స్వగ్రామంలో ఎంజీఆర్‌కు ఘన స్వాగతం

పాతపట్నం: పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు స్వగ్రామం తామర గ్రామంలో ఆదివారం ఘన స్వాగతం పలికారు. మహిళల కోలాటం, బిందె డ్యాన్సులు, క్యాడర్ కేరింతలతో విజయోత్సవం నిర్వహించారు. ఉమ్మడి గ్రామాలైన సీది, తీమర, తామర, పాశిగంగుపేట తదితర గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించగా ఆయనకు హారతులిస్తూ, బాణసంచా కాల్పులు పూల వర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

బొంతు ఎత్తిపోతల ద్వారా సాగునీరు: ఎమ్మెల్యే బగ్గు

జలుమూరు, (సారవకోట): బొంతు ఎత్తిపోతల పనులు పూర్తి చేసి 5 నెలల్లో సాగునీరందిస్తామని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ చిన్నాల కూర్మి నాయుడు అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి కార్యాలయానికి రావడంతో ఎంసీసీ, అధికారులు పూలమాలలు వేసి దుశ్శాలువతో సత్కరించారు. ఇదిలా ఉండగా మండలానికి తొలిసారి వచ్చిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్ నేతృత్వంలో ఘన స్వాగతం పలికారు. మండల అభివృద్ధికి పాటుపడతానని రమణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



జలుమూరు: బగ్గు రమణమూర్తిని సత్కరిస్తున్న ఎంపీపీ కూర్మినాయుడు, మండల అధికారులు

ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవు

నరసన్నపేట: మడపాం, బుచ్చిపేటల నుంచి ఇసుక అక్రమ దందాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఎస్ఈబీ ఏఎస్పీ, నరసన్నపేట పోలీసుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విజయ సాధించడంతో టీడీపీ కార్యాలయ సిబ్బంది తిరుపతి వెళ్లి మొక్కులు చెల్లించి ప్రసాదాన్ని ఎమ్మెల్యే దంపతులకు అందజేసి అభినందించారు. అలాగే ముద్దాడ పేటలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి స్థానిక నేతలు, గ్రామస్థులు అభినందించారు.

వంశధార ఈఈగా శేఖరరావు

టెక్కలి: వంశధార ప్రధాన ఎడమకాలువ టెక్కలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బి.శేఖరరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన కాలువను పరిశీలించారు. మదనగోపాలసాగరం వద్ద ఓటీ ప్రాంతంలో శిథిలమైన షట్టర్లు, కాలువలో పేరుకు పోయిన పూడికలు, గుర్రపు డెక్కలను గుర్తించారు. గొల్లూరు సమీపంలో వంతెన శిథిలమవడంతో ఆ ప్రాంతాన్ని వంశధార ఈఈ బి.శేఖరరావు, డీఈఈ మమత, రైతులు దుర్గారావు, సిబ్బంది త్రినాథ్ పరిశీలించారు.

సౌడాం ఎత్తిపోతల పథకంలో చోరీ

టెక్కలి: కోటబొమ్మాళి మండలం సౌడాం ఎత్తిపోతల పథకంలో విద్యుత్ సామగ్రి చోరీకి గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు రూ.12 లక్షల విలువైన రాగి, డీపీ ఆయిల్ చోరీ చేశారని ఏపీఎస్ఐడీసీ డీఈఈ కామరాజు కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలాన్ని ఆదివారం పోలీసులు పరిశీలించారు.

కళలను పరిరక్షించుకోవాలి

కాశీబుగ్గ: అంతరించిపోతున్న కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి కళాకారుడిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం గిడుగు రామమూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జానపద కళాకారుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కళాపీఠం నిర్వాహకుడు బద్రి కూర్మారావు కళాకారులు కుమార్‌నాయక్, బాడ సూరన్న, బమ్మిడి సుబ్బారావు, పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

నరసన్నపేట: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పదవీ బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా సోమవారం నిర్వహిస్తున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ఆధ్వర్యంలో మంత్రులకు స్వాగతం పలికి నిమ్మాడ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని, నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఘనంగా ధ్వజారోహణం

జలుమూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ఆలయ శాశ్వత ధర్మకర్త పర్లాకిమిడి రాజు కళ్యాణ గజపతి మహదేవ వర్మ పేరున ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సోమవారం రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

గొంతెత్తే వారిని అణచివేయడం అన్యాయం

పలాసరూరల్: హక్కుల కోసం గొంతెత్తిన వారిపై కేసులు పెట్టి అణచి వేయడం అన్యాయమని, దీనిని అందరూ ఖండించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్య దర్శి వంకల మాధవరావు అన్నారు. చిన నీలావతి గ్రామంలో ఆదివారం పార్టీ సమావేశం నిర్వ హించారు. ఇటీవల ప్రముఖ రచయిత అరుంధతి రాయ్‌ని ప్రాసిక్యూట్ చేసేందుకు 14 ఏళ్ల కిందటి కేసులపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతివ్వడం దురుద్దేశంతో కూడినదని, దీనిని ఖండించాలన్నారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి తప్పించాలి

నందిగాం: తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే వర్తింపజేసి స్కూళ్లను బలోపేతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు కోరారు. ఆదివారం నందిగాం ఉన్నత పాఠశాల ఆవరణలో సంఘ సమావేశం నిర్వహించారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని, రోల్‌తో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని తీర్మానించారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు కె.కుమారస్వామి, వై.గణపతి, జె.చంద్రశేఖరరావు, చిన్నవాడు, సురేష్ కుమార్, వేణు, కూరాకులు, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో విశ్రాంత జవాన్ మృతి

వెలిగండ్ల, జూన్ 16: తేనెటీగల దాడిలో విశ్రాంత జవాన్ మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువులో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జుటికే సుందరరావు (57) సీఆర్‌పీఎఫ్‌లో జవాన్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. శనివారం ఆయన భార్య రోజమ్మతో కలిసి కనిగిరిలో బ్యాంకుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. బాపనపల్లి గ్రామ సమీపంలోకి చేరుకునే సరికి ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో భార్యాభర్తలు పంట పొలాల్లోకి పరుగులు తీశారు. అయినప్పటికీ తేనెటీగలు వదలలేదు. ఆ సమయంలో అటుగా ఆటోలో వెళ్తున్న వారు ముఖాలకు కండువాలు కప్పుకుని వెళ్లి భార్యాభర్తలను కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుందరరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. చికిత్స అనంతరం రోజమ్మ కోలుకున్నారు.

ఒంటరి ఏనుగు దాడిలో రైతు మృతి

రామకుప్పం, జూన్ 16: చిత్తూరు జిల్లా కుప్పం రామకుప్పం మండలం పీఎం తాండా సమీపంలో శనివారం రాత్రి ఏనుగు దాడిలో ఓ రైతు మృతి చెందారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో పొలం వద్ద షెడ్‌లో ఆవులను కట్టేసి రైతు కన్నానాయక్ ఇంటికి వెళుతున్నారు. మార్గమధ్యలో తన టమోటా తోటను ఒంటరి ఏనుగు ధ్వంసం చేయడం గమనించిన ఆయన భయంతో పరుగుతీశారు. కొద్ది దూరం వెళ్లగానే కింద పడిపోగా ఒంటరి ఏనుగు దాడిచేసి, తొండంతో దూరంగా విసిరేసింది. దీంతో కన్నానాయక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ఇందిరాగాంధీ స్టేడియంలో నిలిచిన వర్షపు నీరు..



గుణదల సమీపంలో వాహనంతో చిరు వ్యాపారి ఇక్కట్లు..



ఏలూరు రోడ్డులో జోరుగా కురుస్తున్న వాన..

భారీ వర్షానికి విజయవాడ అతలాకుతలం

- గంటసేపు దంచికొట్టిన వాన
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- చెరువుల్లా మారిన రహదారులు

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో గంట సేపు కురిసిన వర్షానికి నగరంలోని రహదారులు చెరువుల్లా మారాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయిన ప్రాంతాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి పురపాలకశాఖ మంత్రి నారాయణ పరిశీలించారు. భవిష్యత్తులో వరద నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, జలమయం అయ్యే ప్రధాన రహదారులను క్షేత్రస్థాయిలో పర్యటించిన మంత్రి.. అధికారులకు సూచనలు చేశారు.

అక్కడక్కడా భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఆదివారం కోస్తా జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ రూరల్‌లో 83, ఏలూరు జిల్లా నిడమర్రులో 80, విజయనగరంలో 70, అల్లూరి జిల్లా కూనవరంలో 48.5, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో 48.5, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 47.5, కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 31.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం అల్లూరి జిల్లాలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



క్యూలైన్‌లో వేచి ఉన్న సర్వదర్శన భక్తులు

శ్రీవారి సర్వదర్శనానికి 36 గంటలు

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం నుంచే రద్దీ పెరగ్గా, ఆదివారం కూడా అదే స్థాయిలో భక్తులు కిక్కిరిసి కనిపించారు. సర్వదర్శన భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వెనుకభాగంలోని రింగురోడ్డు మీదుగా నందకం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపించింది. వీరికి 36 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ ప్రకటించింది.

టీటీడీ నిత్య అన్నదానానికి రూ.10 లక్షలు విరాళం


తుళ్లూరు, జూన్ 16: తిరుమల తిరుపతి దేవస్థానానికి తుళ్లూరు మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బెజవాడ నరేంద్రబాబు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో శనివారం ఆయన కుటుంబ సమేతంగా తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం నిత్య అన్నదాన కార్యక్రమానికి ఆయన రూ.10 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమరావతి రాజధాని శరవేగంగా చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి చెందాలని స్వామిని వేడుకున్నట్టు తెలిపారు.



టీటీడీ అధికారులకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న నరేంద్రబాబు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

చెవి అనేది వినడానికి, సమతాస్థితికి ఉపయోగపడే జ్ఞానేంద్రియం. చెవి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఒటాలజీ అంటారు. మానవుడు 20 హెర్ట్‌జ్‌ల నుంచి 20,000 హెర్ట్‌జ్‌ల వరకు మాత్రమే ధ్వనిని వినగలుగుతాడు. దీనినే శ్రవ్య అవధి అని పిలుస్తారు. 20 హెర్ట్‌జ్‌ల కన్నా తక్కువ పౌనఃపున్యం ఉన్న ధ్వని తరంగాలను పరశ్రావ్యాలు అంటారు. వీటిని ఏనుగులు, గబ్బిలాలు, కుక్కలు వంటి జీవులు వినగలుగుతాయి.



చెవి నిర్మాణం

● బయాలజీ

చెవిలో మూడు భాగాలు ఉంటాయి.
అవి... బాహ్య చెవి, మధ్య చెవి, లోపలి చెవి.

బాహ్య చెవి: దీనిని వెలుపలి చెవి అని కూడా పిలుస్తారు. దీనిలో పిన్నా, బాహ్య శ్రవణ కుహరం, కర్ణభేరి త్వచము అనే మూడు భాగాలుంటాయి. పిన్నాను చెవి దొప్పగా పేర్కొంటారు. ఇది స్థితిస్థాపక మృదులాస్థి నిర్మాణం. బాహ్య శ్రవణ కుహరము ఒక వంపు తిరిగిన నాళంలా ఏర్పడి పిన్నా, కర్ణభేరి త్వచము మధ్య విస్తరించిన నిర్మాణం. చెవి దొప్ప, బాహ్యశ్రవణ కుహర చర్మంలో సున్నిత రోమాలు, మైనం అనేవి ఉంటాయి. చెవిలోకి దుమ్ము, ధూళి ఇతరత్రా రేణువులు ప్రవేశించకుండా రోమాలు, మైనం నిరోధిస్తాయి. కర్ణభేరి త్వచము శంఖువు ఆకారంలో ఉంటుంది. ఈ త్వచము బాహ్య శ్రవణ కుహరాన్ని, మధ్య చెవిని వేరు చేసే పలుచని అర్ధ పారదర్శక పొర. ఈ త్వచం శబ్దతరంగాలను బాహ్య చెవి నుంచి గ్రహించి మధ్య చెవిలోని కూటకానికి అందిస్తుంది.

మధ్య చెవి: మధ్య చెవి అనేది బాహ్య చెవి కర్ణభేరి త్వచానికి, లోపలి చెవి అస్థి విభాజకానికి మధ్యలో విస్తరించి ఉంటుంది. ఇది పుర్రెలోని టెంపోరల్ ఎముకలో ఏర్పడిన గాలితో నిండి ఉంటుంది. మధ్య చెవిలో మాలియస్, ఇంకస్, స్టెపిస్ అనే మూడు అస్థి ఖండాలు ఉంటాయి. మాలియస్‌ని హామర్‌బోన్ అని, ఇంకస్ ని అన్విల్ బోన్ అని, స్టెపిస్‌ని స్టిరప్ బోన్ అని పేర్కొంటారు. ఈ ఎముకలు మూడు గొలుసులుగా ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. మాలియస్ తలభాగం ఇంకస్‌తో, పరాంతభాగం కర్ణభేరి త్వచంతో కలిసి ఉంటుంది. ఇంకస్ అనేది మధ్య ఎముక. ఇది స్టెపిస్ తలతో కలుపబడి ఉంటుంది. లోపలి చెవి అస్థివిభాజకంలోని అండాకార రంధ్రపు కిటికితో స్టెపిస్ కలుపబడి ఉంటుంది. ఈ మాలియస్, ఇంకస్, స్టెపిస్ మూడు ఎముకలు శబ్ద ప్రకంపనలను లోపలి చెవికి అందజేస్తాయి. మధ్య చెవి కుహరం గ్రసనిని కలుపుతూ యుస్టేషియన్ నాళం ఉంటుంది. ఈ నాళం కర్ణభేరి త్వచానికి ఇరువైపులా వాయు పీడనాన్ని సమానస్థాయిలో ఉంచడానికి తోడ్పడుతుంది.

లోపలి చెవి: వినికిడి ప్రక్రియలో ప్రధాన పాత్రను వహించేది లోపలి చెవి. ఇది ద్రవంతో నిండి ఉన్న కుహరం. దీనిని లాబరింత్ అంటారు. దీనిలో బోని లాబరింత్, మెంబ్రినస్ లాబరింత్ రెండు భాగాలు ఉంటాయి. బోని లాబరింత్‌లో వరుసగా కాక్లియా, వెస్టిబుల్, సెమి సర్క్యులర్ కెనాల్స్ అనే మూడు రకాల కుల్యలు ఉంటాయి.

ఎ.కాక్లియా: దీనినే కర్ణావర్తనం అని కూడా పిలుస్తారు. ఇది సర్పిలాకార నిర్మాణం. కాలా వెస్టిబ్యులి, స్కాలా మీడియా, స్కాలా టింపాని అనే మూడు సమాంతర నాళాలుంటాయి.

బి.వెస్టిబుల్: దీనిలోని ముందు భాగాన్ని సాక్యులస్ అని, వెనుక భాగాన్ని యుట్రిక్యులస్ అని పేర్కొంటారు. సాక్యులస్, యుట్రిక్యులస్ రెండింటిని కలిపి ఆటోలిత్ అంగంగా పిలుస్తారు.

సి. సెమి సర్క్యులర్ కెనాల్స్: ఇవి మూడు ఉంటాయి. ఒకదానికొకటి లంబకోణంలో అమరి ఉంటాయి. వీటి పీఠభాగం ఉబ్బి ఉంటుంది.

చెవికి సంబంధించిన అపస్థితులు

ఒటిటిస్ మీడియా: ఇది చిన్న పిల్లల్లో సాధారణంగా ఉండే అపస్థితి. మధ్య చెవిలోని యూస్టేసియన్ నాళం పొట్టిగా ఉన్నట్లయితే బ్యాక్టీరియా సంక్రమణకు గురైనప్పుడు చెవిలో చీము అధికంగా వస్తుంది.

టిన్నిటస్: మెదడులో కణితులు ఏర్పడినప్పుడు గాని, అధిక శబ్దాలు విన్నప్పుడు గాని చెవిలో మైనం(సెరుమినస్) అధికంగా ఏర్పడినప్పుడు గాని లోపలి చెవిలో ఉన్న హేర్ సెల్స్ దెబ్బతింటాయి.

వినికిడి ప్రక్రియ

బాహ్య చెవి శబ్ద తరంగాలను గ్రహించి కర్ణభేరి త్వచం మీదకు మళ్లిస్తుంది. ఈ శబ్దతరంగాలకు అనుగుణంగా కర్ణభేరి త్వచం కంపిస్తుంది. ఈ ప్రకంపనలు మూడు ఎముకలైన మాలియస్, ఇంకస్, స్టెపిస్ ద్వారా అండాకార రంధ్రపు కిటికీ వద్దకి చేరి కాక్లియాలోనికి ప్రవేశించి పెరిలింఫ్, ఎండోలింఫ్ ద్రవాలలో అలలను ఉత్పత్తి చేస్తాయి. ఈ అలలు బేసిల్లార్ త్వచంలో ఒక చిన్న అలను కలిగిస్తాయి. ప్రేరణ వల్ల బేసిల్లార్ త్వచంలోని హేర్ సెల్స్ ఒరిగి టెక్టోరియల్ త్వచం మీద ఒత్తిడి కలిగిస్తాయి. అందువల్ల సన్నిహిత అభివాహి నాడీ కణాలలో నాడీ ప్రచోదనం ఏర్పడి శ్రవణ నాడీ ద్వారా మెదడుని చేరుతుంది. అక్కడ నాడీ ప్రచోదనం విశ్లేషించబడి ధ్వని గుర్తించబడుతుంది.




కె.నాగశేషులు, సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి DIKSUCHI

అనాదిగా భారతీయ వంటగదిలోని పోపులపెట్టే చిన్నపాటి ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ కాగా, పెరటిలోని అనేక మొక్కలు మందులనిచ్చే కల్పతరువులు. దెబ్బలకు పసుపు, కఫానికి తులసి, దగ్గుకు కరక్కాయ, దంత సంరక్షణకు వేపపుల్ల... ఇలా చెప్పుకొంటూపోతే భారతీయ సాంప్రదాయిక విజ్ఞానం ఒక వైద్యరంగం వద్దే ఆగిపోదు. వ్యవసాయం, పశుపోషణ వంటి అనేక రంగాల్లో మమేకమై కనిపిస్తుంది. అదేవిధంగా భారతదేశ భౌగోళిక, వాతావరణ వైవిధ్యతల దృష్ట్యా జన్యు వనరులపరంగా కూడా దేశం సుసంపన్నం.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



'జన్యు వనరులు', 'సాంప్రదాయిక జ్ఞానం'పై
మేధాసంపత్తి ఒప్పందం

అయితే హఠాత్తుగా ఎవరోవచ్చి వీటి వైశిష్ట్యాలను ప్రయోగశాలల్లో తాము నిర్ధారించాము కాబట్టి వీటిపై తమకు యాజమాన్యపు హక్కులున్నాయని అంటే? తరతరాలుగా వస్తున్న సాంప్రదాయిక విజ్ఞానంపై మనకు హక్కు లేకుండా మేధాసంపత్తి హక్కులను వారు దాఖలుపర్చుకుంటే?

నిజానికి గతంలో అదీ జరిగింది. పసుపు, వేప వంటి భారతీయ సాంప్రదాయిక వైద్య విజ్ఞాన అంశాలతోపాటు, నేఫాల్, నేఫాల్-49 గోధుమ రకాలు, బాస్మతి బియ్యం వంటి జన్యు వనరులపై కూడా మేధాసంపత్తి హక్కులను విదేశీ సంస్థలు తీసుకున్నాయి. 1995లో అమెరికా తమ దేశంలోని యూనివర్సిటీ ఆఫ్ మిసిస్సిపీ మెడికల్ సెంటర్ పసుపునకు గాయాలు నయంచేసే గుణం ఉందని ప్రయోగాత్మకంగా రుజువు చేయడంతో పేటెంట్ మంజూరు చేసింది. అయితే ఇండియన్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) అందించిన చారిత్రక ఆధారాలతో తరవాత ఆ పేటెంట్ రద్దయింది.

అదేవిధంగా వేపకాయల నుంచి తీసిన అజాడిరాక్టిన్ ప్రధాన పదార్థంగా తయారుచేసిన ఒక ఔషధంపై 'డబ్ల్యూఆర్ గ్రేస్' అనే కంపెనీకి పేటెంట్ మంజూరైంది. అయితే దీనిపై భారత్ తీవ్రంగా ప్రతిస్పందించడంతో పునఃపరిశీలించి యురోపియన్ పేటెంట్ ఆఫీస్ దానిని రద్దు చేసింది. కానీ యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ ఆఫీస్ దానిని రద్దు చేయలేదు.

భారతదేశానికి చెందిన నాప్‌హాల్ గోధుమ రకాలపై 2003లో ఒక యురోపియన్ కంపెనీ బయోపైరసీ(ప్రకృతిసిద్ధ సహజ జన్యు పదార్థాల అక్రమ వినియోగం) చేసి పేటెంట్లు పొందింది. వాస్తవానికి ఇవి సహజ వనరులని, కొత్త ఆవిష్కరణలు కావని భారత అధికారులు సాక్ష్యాలు సమర్పించడంతో పేటెంట్లు రద్దుచేశారు.

ఇదేవిధంగా 2000 సంవత్సరంలో కూడా ఒక అమెరికన్ కంపెనీ బాస్మతి బియ్యంపై పొందిన పేటెంట్‌ను రద్దు చేయించడానికి భారతీయ అధికారులు పెద్ద న్యాయపోరాటమే చేశారు.

ఈవిధంగా ఒక దేశానికి లేదా ప్రాంతానికి చెందిన సాంప్రదాయిక జ్ఞానం, జన్యు వనరులపై వేరొకరు పేటెంట్ పొందడమంటే వారి హక్కులను హరించడమే కాదు, న్యాయంగా వారికి దక్కాల్సిన ప్రయోజనాలు దక్కకుండా పోవడమే. అందుకే ఈ సమస్యను పరిష్కరించడానికి సాంప్రదాయిక, జన్యు వనరులను ఎవరైనా వినియోగిస్తున్నప్పుడు న్యాయబద్ధంగా సంబంధీకులకు దక్కాల్సిన వాటాను అందించడానికి తోడ్పడేలా 2010లో నగోయా ప్రోటోకాల్ తీసుకువచ్చారు. అయితే ఇది అంత సమర్థంగా పనిచేయక పోతుండటంతో మరో కొత్త కట్టుబాటు అవసరమైంది. ఈ నేపథ్యంలో ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్) ఇటీవల 'ట్రీటీ ఆన్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ(ఐపీ), జెనెటిక్ రిసోర్సెస్ (జీఆర్స్) అండ్ అసోసియేటెడ్ ట్రెడిషనల్ నాలెడ్జ్(ఏటీకే) (మేధా సంపత్తి, జన్యు వనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం) తీసుకువచ్చారు.

ప్రపంచ మేధోసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ) ప్రధాన కార్యాలయం(జెనీవా)లో 2024 మే 13-24 మధ్య రెండువారాల పాటు, 192 దేశాలు 86 మంది పరిశీలకులు సుదీర్ఘ చర్చలు జరిపిన దరిమిలా మే 24న 'మేధాసంపత్తి, జన్యువనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం' సాకారమైంది.

ఒప్పంద ముఖ్యాంశాలు

1. ఇప్పటివరకూ ఉన్న మేధోసంపత్తి పరిరక్షణ ఒప్పందాలన్నింటిలోనూ సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులపై స్థానికులకు ఉన్న హక్కును గుర్తించిన ఏకైక ఒప్పందం ఇది.
2. ఒక దేశానికి సంబంధించిన సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులను ఇతరులు దోచుకోకుండా, అక్రమంగా వినియోగించుకోకుండా ఈ ఒప్పందం అడ్డుకుంటుంది. దీనిలో ఉన్న 'మాండేటరీ డిస్‌క్లోజర్ ఆబ్లిగేషన్స్' అనే నిబంధన ప్రకారం పేటెంట్ దరఖాస్తుదారు ఏదైనా జన్యువనరులను గానీ, సాంప్రదాయిక విజ్ఞానాన్ని గానీ తమ ఆవిష్కరణలో వినియోగిస్తే అది ఏ దేశానికి చెందిందో, ఆ విజ్ఞానాన్ని పరిరక్షిస్తున్న వారెవరో కూడా స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది.
3. ఈ ఒప్పందం ద్వారా జన్యు వనరులు, సాంప్రదాయిక విజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా పరిరక్షించేందుకు అన్ని భాగస్వామ్య దేశాలు తమ దేశీయ మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్'(సదరు జన్యు వనరు/సాంప్రదాయిక విజ్ఞానం ఏ ప్రాంతానికి చెందిందో వెల్లడించే) నిబంధనను చేర్చాల్సి ఉంటుంది.
4. ఈ ఒప్పందం సాంప్రదాయిక విజ్ఞానం, జన్యువనరుల నుంచి నేరుగా సంగ్రహించిన అంశాలకు కాక వాటిని వినియోగించి చేసిన సరికొత్త ఆవిష్కరణలకు మాత్రమే మేధోసంపత్తి హక్కులను అందించడానికి సమ్మతిస్తుంది.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

మేధాసంపత్తి హక్కు అంటే?

ఒక వ్యక్తి లేదా సంస్థ ఆవిష్కరణలను, ఇతరులు కాపీచేసి వారు అనాయాస లబ్ధి పొందకుండా ఆవిష్కర్తకు ఆ ఆవిష్కరణపై కొంత కాలానికి సర్వహక్కులు కల్పిస్తూ ఇచ్చే చట్టబద్ధమైన హక్కు.

ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ)

- ఇది ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక అంగము. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది.
- దీనిని మేధోసంపత్తి హక్కుల విషయమై అంతర్జాతీయ సహకారం పెంపొందించడానికి 1967లో ఏర్పాటుచేశారు.
- దీనిలో 193 సభ్యదేశాలున్నాయి.
- భారతదేశం 1975లో దీనిలో చేరింది.
- మేధాసంపత్తి హక్కుల విషయమై చర్చలకు ఒక అంతర్జాతీయ వేదికగా, వివాద పరిష్కార కేంద్రంగా పనిచేస్తుంది.
- అంతర్జాతీయ మేధాసంపత్తి ఒప్పందాలను పర్యవేక్షిస్తుంది.
- మేధాసంపత్తి హక్కుల రిజిస్ట్రేషన్ చేస్తుంది.

ఒప్పంద ప్రయోజనాలు

1. సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల సంవృద్ధి గల భారతదేశం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలు, హక్కులు పరిరక్షించగలుగుతారు.
2. బయోపైరసీ ద్వారా ఇతరులు అక్రమ లబ్ధి పొందడాన్ని నివారించి సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల పరిరక్షణతో సంబంధం గల స్థానిక ప్రజలకు లబ్ధి చేకూరుతుంది.
3. మేధాసంపత్తి హక్కుల పరిరక్షణలో అంతర్జాతీయ ప్రమాణాలు ఏర్పడి, దేశాల మధ్య మేధాసంపత్తి హక్కుల వివాదాలు తగ్గుముఖం పడతాయి. పారదర్శకత పెరుగుతుంది.
4. విజ్ఞాన చౌర్యం, జన్యు వనరుల నకిలీలు తయారు కాకుండా ప్రాచీన విజ్ఞానం, జన్యు వనరుల ఆధారంగా సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించవచ్చు.

అయితే 1999 నుంచి జరిపిన సుదీర్ఘ చర్చల ప్రతిరూపంగా 25 సంవత్సరాల తరవాత సాకారమైన ఈ ఒప్పందం అమలులోకి రావాలంటే కనీసం 15 సభ్యదేశాలు సంతకాలు చేసి, దానిని ర్యాటిఫై (ధృవీకరించాల్సి) ఉంటుంది. అదేవిధంగా ఇది పటిష్టంగా అమలుకావాలంటే అన్ని దేశాలు తమ మేధాసంపత్తి హక్కుల చట్టాలను ఈ ఒప్పందానికి అనుగుణంగా సరిదిద్దాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు కేవలం 35 దేశాల్లో మాత్రమే 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్' వంటి నిబంధనలు వారి మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో చేర్చారు. ఇకముందు ఎన్ని ఎక్కువ దేశాలు ఇలాంటి నిబంధనలను స్వీకరిస్తాయన్న దానిపైనే ఈ ఒప్పంద అమలు ఆధారపడి ఉంటుంది. ఈ ఒప్పందం పటిష్టంగా అమలుకావడమంటే ప్రపంచ జీవవైవిధ్యంలో ఏడు నుంచి ఎనిమిది శాతం వరకు కలిగి ఉన్న, సాంప్రదాయిక విజ్ఞానపరంగా సుసంపన్నమైన భారతదేశానికి శుభపరిణామమే.